# చచ్చు కథ

"ఈ మధ్య ఓ కథ రాశానోయ్!"

"అహ, అలాగ!"

"చిన్న కథేకాని, చాలా మంచి కథ ఎలా రాశానా అని నాకే ఆశ్చర్యంగా వుంది."

"అంత మంచి కథా?"

కొంచెం సిగ్గుపడ్డాడతను.

"చదవ మంటావా?"

"చదువు!"

"అయితే విను!" అని గొంతు సవరించుకుని, చదవటం మొదలు పెట్టాడు వినయమూర్తి.

"కథపేరు— పేదవాడికి శత్రువు"

'పేరు బావుంది. చదువు!' అన్నాన్నేను.

కథ చదవటం మొదలుపెట్టాడతను, నా కాంప్లిమెంట్ కి పొంగి పోతూ.

"ఆ రోజు ఆదివారం. నెలలోని నాలుగో ఆదివారం అది. అవసరాలయితే చాలా వున్నాయి కాని, నా దగ్గిర డబ్బులాట్టేలేవు. అప్పుకోసం బైయిల్దేరాను. మొన్ననే ముకుందాన్ని అడిగాను—ఎంతో కొంత సర్దమని.

"ఆదివారం వరకూ ఏమీ ఇవ్వలేను. ఆదివారంనాడు మధ్యాహ్నం మాయింటికిరా! నువ్వడిగినంత కాకపోయినా ఎంతోకొంత సర్దుతాను" అన్నాడు ముకుందం.

"చాలా థేంక్స్"

"దానికేముందిగాని, ఆదివారం సాయంత్రం అయిదు గంటల లోపునే మాయింటికొచ్చెయ్! ఆ తర్వాత వస్తే వుండను. మా ఆవిడ సినిమా ప్రోగ్రాం వేసింది. అయిదు తర్వాత వస్తే అనవసరంగా డిసప్పాయింట్ అవుతావ్!" అని చిన్నపాటి వార్నింగ్ కూడ ఇచ్చాడు ముకుందం.

ఆదివారం నాడు, అందులో నెలలోని నాలుగో ఆదివారంనాడు సినిమా కెళుతున్నారుట. ఎంత అదృష్టం.

తాము సినిమా కెళ్ళి ఎన్నాళ్ళయిందో! నిత్యావసరాలు గడవడమే గగనమై పోతుంటే ఇక సినిమాలు, షికార్లు ఎక్కడినుంచి వస్తాయి? సినిమాదాకా ఎందుకు? సాయంత్రం ఇంటికెళ్ళేటపుడు ఓ మల్లెపూదండ తీసికెళ్ళి ఎన్ని రోజులైందని? హోటల్లో కాఫీ తాగి ఎన్నినెలలయింది??

బస్సుకోసం చూసిచూసి విసుగెత్తిపోతోంది. అన్నిబస్సులూ వస్తున్నాయి కాని, నాక్కావలసిన బస్సు మాత్రం రావటంలేదు.

టైమేమో గడిచి పోతోంది. బస్సేమో రావటం లేదు. అయిదు దాటితే ముకుందం సినిమాకి వెళ్ళిపోతాడు. ఎలాగ?

ఎలాగోలాగా ముకుందం దగ్గిరకి అయిదులోగా చేరుకుంటే ఆ తర్వాత పరవాలేదు. ఆడిన మాట తప్పేరకం కాదు ముకుందం. ఎంతోకొంత తప్పకుండా ఎడ్జస్ట్ చేస్తాడు!

రిక్షాలో వెడదామని తీర్మానించుకున్నాను —

"గాంధీ నగరం వస్తావా?"

"గాంధీ నగరంలో ఏడికవాలండి?"

"బస్టాపు"

'రండి!'

'ఏమిమ్మంటావ్?'

'రూపాయి పావలా ఇప్పించండి!'

నేను నిలబడినచోటునుంచి గాంధీనగరానికి రూపాయి రివాజురేటు. ఎండమండిపోతోంది కాబట్టి మరో పావలా ఇచ్చినా ఇవ్వొచ్చు.

కాని—

అంత డబ్బు రిక్షాకు ఖర్చు పెట్టటం ఇష్టం లేక అన్నాను 'ముప్పావలా ఇస్తాను!'

'అయిబాబు. నేనడిగింది రివాజు రేటేనండి!' అన్నాడు రిక్షావాలా. నేనిక అతన్తో మాటాడకుండా మరో రిక్షా అడిగాను—అదేరేటు.

ఇక లాభంలేదని రెండడుగులేసి ఒక మూలనున్న రిక్షానడిగాను.

"రూపాయిప్పించండి!"

'ముప్పావలా ఇస్తాను'

అతను రాలేదు. ఏం చేద్దామా అని సంశయిస్తుండగా—

మరో రిక్షా వచ్చింది. రిక్షా అతను వయసులోనే వున్నాడు కాని అస్థిపంజరాన్ని ఏదో నల్లటి గుడ్డలో పెట్టికుట్టినట్టుగా వుంది అతని శరీరం.

"గాంధీ నగరం వస్తావా?"

'ఒక్క రూపాయిప్పించండి బాబూ!'

'ముప్పావలా ఇస్తాను'

కాసేపు తటపటాయించి అన్నాడతను 'రండి!'

రిక్షా ఎక్కి కూచున్నాను. అప్పుడు నాకనిపించింది—అందరు రిక్షావాళ్ళు రూపాయిపావలా చెప్పివుంటే, నా అవసరాన్ని బట్టి చచ్చినట్టు ఆ రేటుకే వెళ్లివుండేవాడిని, ఒక రిక్షావాడి బేరాన్ని చెడగొట్టింది-మరో రిక్షావాడు. పేదవాడికి శత్రువు ఎవ్వరూ కాదు పేదవాడే!'

చదవటం పూర్తిచేసి అడిగాడు వినయమూర్తి 'ఎలావుంది?'

'ఏడిసినట్టుంది' వెంటనే అన్నాను నేను.

'అదేమిటోయ్! అన్నీ ఒకే మూసలో—అస్సలు వెరైటీ లేకుండా రాస్తున్నానని చెప్పేసి నువ్వుతిడుతున్నావని - ఓ మంచి కథ రాస్తే ఇప్పుడు కూడ తిడుతున్నావు?'

'నీలాంటివాణ్ణి అలా తిట్టటం పొరపాటని ఇప్పుడే తెలుసుకున్నాను. సర్లే—ఆ గొడవకేంగాని, నీ కథలోని లోపాలు చెప్తాను విను!'

ఎర్రబడిన మొహంతో నాకేసి చూశాడు వినయమూర్తి.

''నువ్వు నిలబడిన చోటునుంచి గాంధీనగరానికి రూపాయి రివాజు రేటు. ఎండ ఎక్కువగా వుంది కాబట్టి మరో పావలా ఇచ్చినా తప్పులేదు. అని రాశావు. అంటే అలా నువ్వనుకుంటూనే, జాలి పడుతూనే ముప్పావలా కంటే ఎక్కువ ఇవ్వనంటావ్. ఎందుకొచ్చిన జాలి అది?''

''అదేమిటి? నేను డబ్బున్నవాణ్ణి కాదుకదా కథలో?''

మధ్యలో అడ్డురాకు. ఇందాక నేను చెప్పినది నీ కథలోని లోపంగా నువ్వొప్పుకున్నా లేకపోయినా— అసలు లోపం చెప్తాను విను! పేదవాడికి శత్రువు పేదవాడెప్పుడూ కాదు'

"అదేమిటి? చిన్నపుడు మా తాతగారి పొలం నూర్చటానికి రెండు రూపాయలకు తక్కువ కూలి ఇస్తే నూర్చమన్నారు కూలీలంతాను. అప్పుడు పొరుగూరినుంచి రూపాయిన్నర కూలికే వచ్చి నూర్చారు కొంత మంది కూలీలు'' అన్నాడు వినయమూర్తి.

'కూలీలలో ఆ భేదాన్ని సృష్టించింది మీ తాతగారు కాదూ! పేద వాడికి శత్రువు డబ్బున్నవాడే కానీ పేదవాడెప్పుడూ కాదు మూర్తీ! ఆ కూలీలు తక్కువ రేటుకి మీ పొలం నూర్చటానికి, నీ కథలో రిషా అబ్బాయి ముప్పావలాకే గాంధీనగరం రావటానికి కారణం-డబ్బు. డబ్బుతో వాళ్ళ అవసరాలు ముడిపడి వుండటం. వాళ్ళకి కూడ డబ్బుంటే సీలాగా అవసరాలు తీర్తుంటే, వాళ్ళు రెక్కలు ముక్కలు చేసుకుని రిషాలు ఎందుకు తొక్కుతారు? కూలి పనెందుకు చేస్తారు—అందులోనూ తక్కువ రేటుకి."

"అదేమిటి, నేను చదువుకుని ఉద్యోగం చేస్తున్నాను. వాళ్ళ నెవడు చదువుకోవద్దన్నాడు?" ఉక్రోషంగా అడిగాడు మూర్తి.

''మళ్ళీ అక్కడే పప్పులో కాలేస్తున్నావు. మన వ్యవస్థ వాళ్ళని చదువుకోనివ్వలేదు. సాంఘికంగా, ఆర్థికంగా, మానసికంగా వాళ్ళని ఎదగ నివ్వలేదు."

"అంచేత—మిడిమిడి జ్ఞానంతో ఇలాటి చచ్చుకథలెప్పుడూ రాయకు!"

వినయమూర్తి మళ్ళీ ఎప్పుడూ నాకు తనకథ వినిపించలేదు.

—